

నేటి నుంచి జాతీయ నృత్యపోటీలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

బివిఆర్ కళా కేంద్రం ఆధ్వర్యంలో జాతీయస్థాయి నృత్య పోటీలు, 31వ జాతీయస్థాయి నాటక పోటీలు ఈ నెల 18 నుంచి జరగనున్నాయి. 25వ తేదీ వరకు పోటీలు జరుగుతాయని బివిఆర్ కళాకేంద్రం వ్యవస్థాపకులు బుద్దాల వెంకట రామారావు తెలిపారు. శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 18, 19 తేదీల్లో తాడేపల్లిగూడెం సుబ్బారావుపేటలోని బివిఆర్ కన్వెన్షన్ సెంటర్లో జాతీయస్థాయి నృత్య పోటీలు జరుగుతాయన్నారు. కూచిపూడి, భరతనాట్యం, కథకళి తదితర నృత్యాలను ప్రదర్శిస్తారన్నారు. దాదాపు పది రాష్ట్రాల నుంచి నృత్యకారులు ఈ కార్యక్రమానికి హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ నెల 20వ తేదీ నుంచి 25వ తేదీ వరకు తాడేపల్లిగూడెం బివిఆర్ కళా కేంద్రంలో 31వ జాతీయస్థాయి నాటక ఉత్సవాలు జరుగుతాయని, ఎంపిక చేసిన నాటికలను ప్రదర్శిస్తారని తెలిపారు. ఈ నాటకోత్సవాల్లో సురభి నాటకాలను ప్రత్యేకంగా ప్రదర్శిస్తున్నట్లు బివిఆర్ కళా కేంద్రం వ్యవస్థాపకులు బుద్దాల రామారావు తెలిపారు.

పథకాల సొమ్ము అందేనా..!



- ఎన్నికల ముందు బటన్ నొక్కుడు
- లబ్ధిదారుల ఖాతాల్లో నేటికీ జమకాని దుస్థితి
- ఎన్నికల కమిషన్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినా తాత్సారం
- చేయూత, విద్యాదీవెన, ఇన్‌పుట్ సబ్సిడీ, ఇబిసి నేస్తం
- లబ్ధిదారులంతా ఎదురుచూపు
- రెండు జిల్లాల్లో దాదాపు రూ.500 కోట్లకు పైగా సొమ్ము పెండింగ్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎన్నికల ముందు వివిధ పథకాలకు సంబంధించి బటన్ నొక్కినా సొమ్ము ఇప్పటికీ లబ్ధిదారుల ఖాతాల్లో జమ కాలేదు. ఎన్నికల కమిషన్ మే 13 తర్వాత నగదు జమ చేసుకోవచ్చునని గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినప్పటికీ సొమ్ము జమ చేయకపోవడం జనాల్లో చర్చనీయాంశంగా మారింది. ఎన్నికలకు రెండు రోజుల ముందు పథకాల సొమ్ము జమపై పెద్దఎత్తున రాద్ధాంతం జరగడం, మే 14న సొమ్ము జమకు ఎన్నికల కమిషన్ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంపై జనానికి స్పష్టత ఉంది. ఎన్నికలు పూర్తయ్యి నాలుగు రోజులు గడవడంతో సొమ్ము కోసం లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. మార్చి 16న ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. నోటిఫికేషన్‌కు ముందు మార్చి రెండో తేదీన విద్యాదీవెన, మార్చి ఆరో తేదీన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, మార్చి ఏడో తేదీన చేయూత, మార్చి 14న ఇబిసి నేస్తం, ఫిబ్రవరి నెలాఖరును కల్యాణమస్తు, షాదీ తోఫా పథకాలకు సంబంధించి సిఎం బటన్ నొక్కి సొమ్ము విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే నేటికి సొమ్ము లబ్ధిదారుల ఖాతాల్లో జమకాని పరిస్థితి ఉంది. ఎన్నికలకు రెండు రోజుల ముందు ఈ పథకాల సొమ్ము జమ కోసం ప్రభుత్వం రూ.14,165 కోట్లు సొమ్ము రెడీ చేసింది. మార్చి మొదటి వారం నుంచి నిధులు జమ చేయకుండా ఎన్నికలకు రెండు రోజుల ముందు సొమ్ము జమకు ప్రభుత్వం పూనుకోవడాన్ని ఎన్నికల కమిషన్ అడ్డుకుంది. ఎన్నికలు పూర్తయిన మే 13 తర్వాత రోజు సొమ్ము జమ చేసుకోవచ్చని తెలిపింది. ఎన్నికలు పూర్తయ్యి రోజులు గడుస్తున్నా సొమ్ము జమ కాలేదు.

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు రూ.500 కోట్లకు పైగా సొమ్ము వివిధ పథకాల లబ్ధిదారులకు అందాల్సి ఉంది. ఏలూరు జిల్లాలో గడిచిన ఖరీఫ్‌లో మిచౌంగ్ తుపానుతో పంటలు దెబ్బతిన్న 24,679 మంది రైతులకు రూ.20.19 కోట్లు సబ్సిడీ సొమ్ము అందాల్సి ఉంది. 45 ఏళ్లు నిండిన మహిళలకు ఇచ్చే చేయూత పథకం కింద 1,14,874 మంది మహిళలకు రూ.215.39 కోట్లు, ఇబిసి నేస్తం కింద అగ్రవర్ణ పేదలకు 12,660 మందికి రూ.18.99 కోట్లు, విద్యాదీవెన కింద 32,452 మంది విద్యార్థులకు రూ.26.42 కోట్లు, కళ్యాణమస్తు, షాదీతోఫా కింద 437 మందికి రూ.3.52 కోట్లు అందాల్సి ఉంది. పశ్చిమగోదావరి జిల్లాలో రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద 32,545 మందికి రూ.26.72 కోట్లు, చేయూత కింద రూ.85,105 మందికి రూ.159.57 కోట్లు, ఇబిసి నేస్తం కింద రూ.26.69 కోట్లు, కళ్యాణమస్తు, షాదీతోఫా కింద 411 మందికి రూ.2.84 కోట్లు జమ చేయాల్సి ఉంది. శుక్రవారం కొంతమందికి విద్యాదీవెన సొమ్ము జమ చేసినట్లు తెలుస్తోంది. ఇంకా విద్యాదీవెన సొమ్ము జమ కావాల్సిన లబ్ధిదారులు ఉన్నట్లు సమాచారం. మిగిలిన పథకాలకు సంబంధించి సైతం సొమ్ము జమపై స్పష్టత లేదు. రెండు జిల్లాల్లోనూ వివిధ పథకాలకు సంబంధించి దాదాపు మూడు లక్షల మందికిపైగా లబ్ధిదారులు సొమ్ము కోసం వేచిచూస్తున్నారు. ఎన్నికల ముందు పథకాల సొమ్ము జమపై హడావుడి చేసి ఇప్పుడు ప్రభుత్వం ఎందుకు తాత్సారం చేస్తుందనే చర్చ జనాల్లో తీవ్రంగా సాగుతోంది. విద్యాదీవెన సొమ్ము సకాలంలో జమ కాకపోవడంతో ఎంతోమంది విద్యార్థుల తల్లిదండ్రులు అప్పు చేసి ముందుగానే కాలేజీలకు ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పథకాల సొమ్మును లబ్ధిదారులకు ఇవ్వకుండా ప్రభుత్వం తమ అనుయాయులైన కాంట్రాక్టర్లకు ఇస్తున్నట్లు ప్రచారం సాగుతుండటంతో జనంలో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా వెంటనే లబ్ధిదారులకు నిధులు జమ చేయాలని జనం కోరుతున్నారు.



రైతులను బలవంతంగా వ్యాన్ ఎక్కిస్తున్న పోలీసులు

భయపెట్టేందుకేనా..!

- ఒఎన్‌జిసి పైపులైన్ పనులపై రైతుల అభ్యంతరం
- చర్చలు, పరిహారం మాని బలవంతంగా రైతుల తరలింపుపై సర్వత్రా చర్చ
- పుంత భూముల్లో ప్రమాదం జరిగేతే రైతులకు నష్టం కాదా
- అధికారుల తీరుపై సర్వత్రా విస్మయం
- కలెక్టర్ జోక్యంతో తాత్కాలికంగా ఆందోళన విరమణ
- సందేహాలు నివృత్తి చేసి, పరిహారం చెల్లించాకే పనులు చేపట్టాలి: సిపిఎం

ప్రజాశక్తి - నరసాపురం

తమ భూముల్లోంచి గ్యాస్ పైపులైన్ వేయొద్దని ఆ రైతులు చాలాకాలంగా పోరాడుతున్నారు. ఏదైనా ప్రమాదం సంభవిస్తే బాధ్యత ఎవరిదని ప్రశ్నిస్తే సమాధానం లేదు. ఈ నేపథ్యంలో పరిహారం ఇస్తామన్నారుగా అని రైతులు కొంత శాంతించారు. అయితే పరిహారం ఏమీ ఇవ్వకుండానే గుట్టుచప్పుడు కాకుండా పోలీసు బందోబస్తు నడుమ ఒఎన్‌జిసి సిబ్బంది పుంతరోడ్డు గుండా పైపులైన్ నిర్మాణం చేపట్టారు. ఇదేమిటని ప్రశ్నిస్తే ప్రభుత్వ భూమి అయినందున పరిహారం చెల్లించనవసరం లేదని తేల్చి చెప్పారు. ఇది దారుణమని అంటున్న రైతులను పోలీసులు బలవంతంగా లాక్కెళ్లి వ్యాన్‌లోకి ఎక్కించి తరలించడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఈ ఘటన శుక్రవారం ఉదయం మండలంలోని రుస్తుంబాద-యర్రంశెట్టివారిపాలెం గ్రామాల నడుమ చోటుచేసుకుంది. అధికారుల తీరుపై సర్వత్రా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

సీతారామపురంలోని రిగ్ నుంచి రుస్తుంబాద్‌లోని టెంపుల్‌ల్యాండ్‌లో నాలుగో గేటులోనికి యర్రంశెట్టివారిపాలెం మీదుగా ఒఎన్‌జిసి పైపులైన్ నిర్మాణం తలపెట్టింది. దీనిలో కొంత మేర పనులు కూడా పూర్తయ్యాయి. అయితే రుస్తుంబాద-యర్రంశెట్టివారిపాలెం నడుమ పొలాల్లోంచి పైపులైన్ ఏర్పాటును రైతులు గతంలో అడ్డుకున్నారు. దీనిపై పలుదఫాలుగా చర్చించిన అధికారులు నష్టపరిహారం ఇస్తామని ప్రకటించడంతో రైతులు శాంతించారు. అయితే తర్వాత ఆ ఊసే లేదు. దీంతో రైతులు కూడా పరిహారం గురించి పట్టించుకోలేదు. సుమారు ఆరేళ్ల అనంతరం మళ్లీ శుక్రవారం ఉదయం భారీ పోలీసు బందోబస్తు నడుమ ఒఎన్‌జిసి సిబ్బంది పైపులైన్ పనులు చేపట్టారు. అయితే తొలుత చెప్పినట్లు పొలాల్లోంచి కాకుండా ఆ పొలాలకు వెళ్లే పుంత రోడ్డుగుండా పైపులైన్ పనులు ప్రారంభించారు. ఇదేమిటని ప్రశ్నించిన రైతులకు పుంత రోడ్డు ప్రభుత్వానిది కాబట్టి పరిహారం చెల్లించాల్సిన అవసరం లేదని అక్కడున్న అధికారులు ముక్తాయించారు. ఇది దారుణమని, పుంత రోడ్డులో తరచూ తిరిగే తమకు ఈ పైపులైన్ వల్ల ఏదైనా ప్రమాదం సంభవిస్తే పరిస్థితి ఏమిటని, పొలాలకు నష్టం వాటిల్లదా, కోనసీమ జిల్లాలోని నగరంలో చోటుచేసుకున్న ఘటన తమకు గుర్తుంది అని రైతులు ఆందోళనకు దిగారు. వెంటనే పోలీసులు రంగంలోకి దిగి నరసాపురం డిఎస్‌పి శ్రీనివాసులు ఆధ్వర్యాన రైతులను బలవంతంగా అదుపులోకి తీసుకుని వ్యాన్ ఎక్కించి అక్కడ నుంచి తరలించారు. ఈ విషయం తెలియగానే రుస్తుంబాదలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అయితే రైతులను భీమవరంలోని కలెక్టరేట్‌కు తరలించారని, కలెక్టర్‌తో మాట్లాడిస్తున్నారని తెలియడంతో గ్రామస్తులు కొంత శాంతించారు.



పనులు చేస్తున్న ఒఎన్‌జిసి సిబ్బంది

ఇదిలా ఉండగా పోలీసులు అదుపులోకి తీసుకున్న రైతులను కలెక్టర్ సుమిత్‌కుమార్ వద్దకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా రైతులు తమ ఇబ్బందులు, ఆందోళనను వివరించారు. దీంతో రైతుల సందేహాలను నివృత్తి చేసేవరకూ పైపులైన్ పనులు ఆపాలని కలెక్టర్ అక్కడికక్కడే ఆదేశించడంతో ఒఎన్‌జిసి సిబ్బంది పనులు ఆపివేశారు. అనంతరం గ్రామానికి రైతులు చేరుకోవడంతో గ్రామస్తులు శాంతించారు. ఈ సందర్భంగా రైతులు యర్రంశెట్టి హరి తదితరులు మాట్లాడుతూ ఈ పైప్‌లైన్ వల్ల భవిష్యత్తులో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో పైప్‌లైన్ వేస్తామని పనులు ప్రారంభించినప్పుడు ఆందోళనతో మారుబోయిన సత్యనారాయణ మృతి చెందాడన్నారు. గతంలో ఒఎన్‌జిసి అధికారులు రైతులకు నష్టపరిహారం ఇస్తామని చెప్పారని, ఇప్పుడు అదేమీ చేయకుండానే పనులు ప్రారంభించారని ఆందోళన వ్యక్తం చేశారు. తమపై దౌర్జన్యానికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పనులు తాత్కాలికంగా నిలుపుదల : తహశీల్దార్

కలెక్టర్ ఆదేశాల మేరకు పైపులైన్ పనులు రెండు రోజులు తాత్కాలికంగా నిలిపేస్తున్నామని తహశీల్దార్ ఎన్ఎస్ఎస్.ప్రసాద్ తెలిపారు. త్వరలో స్థానిక రైతులు, గ్రామస్తులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు.

అరెస్టు చేయలేదు : నరసాపురం డిఎస్‌పి శ్రీనివాస్

రుస్తుంబాదలో రైతులనుగాని, ఇతరులనుగాని అరెస్టు చేయలేదని నరసాపురం డిఎస్‌పి శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఆందోళన చేస్తున్న రైతులను కలెక్టరేట్‌కు తీసుకెళ్లి రైతులతో మాట్లాడించామన్నారు.

పైపులైన్ నిర్మాణ పనులు ఆపాలి జనసేన నేత బొమ్మిడి నాయకర్

ఒఎన్‌జిసి పైపులైన్ నిర్మాణ పనులను వెంటనే నిలుపుదల చేయాలని జనసేన నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపడుతున్న ప్రాంతాన్ని సందర్శించి, గ్రామస్తులు, రైతులతో మాట్లాడారు. అనంతరం జిల్లా కలెక్టర్, తహశీల్దార్, ఒఎన్‌జిసి అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. తక్షణం పనులు నిలుపుదల చేయాలని కోరారు. రైతుల్లో భయాన్ని పోగొట్టి వారికి న్యాయం చేశాక పనులు చేపట్టాలన్నారు. ఆయన వెంటనే ఆకన చంద్రశేఖర్, బందెల రవీంద్ర, పులి భుజంగరావు, యడ్లపల్లి మహేష్, పులి శ్రీరాములు, కాకుమాళ్ల బాబి, యడ్లపల్లి తాతాజీ, పోలిశెట్టి బాలు వెంకన్న, యడ్లపల్లి పద్మారావు సాయి, గాది ఆలం ప్రభు ఉన్నారు.

అధికారుల తీరుకు సిపిఎం ఖండన

రుస్తుంబాదలో రైతుల పట్ల అధికారులు వ్యవహరించిన తీరును సిపిఎం తీవ్రంగా ఖండిస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు అన్నారు. రైతులకు అవగాహన కల్పించి, వారికి నష్ట పరిహారం చెల్లించిన తర్వాతనే పైపులైన్ పనులు చేపట్టాలని, అప్పటి వరకూ పనులు ఆపివేయాలని అన్నారు. భవిష్యత్తులో ఏదైనా ప్రమాదం జరిగితే ఒఎన్‌జిసి అధికారులదే బాధ్యతని స్పష్టం చేశారు.

ఇతరులకు స్ట్రాంగ్‌రూముల వద్ద నో ఎంట్రీ

కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఇవిఎంలు భద్రపరచిన స్ట్రాంగ్‌రూముల వద్దకు అనుమతి లేనిదే ఎవరికీ ప్రవేశం లేదని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం భీమవరం విష్ణు కాలేజీలో భద్రపరిచిన ఇవిఎంల స్ట్రాంగ్‌రూములను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, భద్రతా అధికారులతో సమీక్షించి తగు సూచనలు జారీ చేశారు. పరిశీలన అనంతరం స్ట్రాంగ్‌రూముల వద్ద ఏర్పాటు చేసిన సందర్శకుల పుస్తకంలో ఆయన సంతకం చేశారు. భద్రతా అధికారులతో మాట్లాడుతూ స్ట్రాంగ్‌రూమ్‌ల భద్రత దృష్ట్యా అనుమతుల్లేని ఏఒక్కరినీ ఆ ప్రదేశానికి అనుమతించొద్దని, ఐడి కార్డులు కలిగిన వ్యక్తులకు సంబంధించి ఐడి కార్డును, వ్యక్తులను పూర్తిగా తనిఖీ చేశాకే నిర్దేశిత ప్రాంతం వరకు మాత్రమే అనుమతించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఏ ఒక్కరూ సెల్‌ఫోన్ తీసుకెళ్లడానికి అనుమతి లేదని, అనుమతి ఉన్న వ్యక్తుల వద్ద నుండి కూడా సెల్‌ఫోన్ డిపాజిట్ చేసుకుని మాత్రమే అనుమతించాలని తెలిపారు. ఆచంట, పాలకొల్లు, నరసాపురం, తణుకు నియోజకవర్గాలకు సంబంధించిన ఇవిఎంలను విష్ణు కాలేజీలో, భీమవరం, ఉండి, తాడేపల్లిగూడెం నియోజకవర్గాలకు సంబంధించిన ఇవిఎంలను ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపర్చిన విషయం గుర్తు చేశారు. కలెక్టర్ వెంట డిఆర్ఒ జె.ఉదయభాస్కరరావు, పోలీస్ అధికారులు ఉన్నారు.



స్ట్రాంగ్ రూముల వద్ద అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

ఎపి కౌలురైతుల సంఘం

ప్రజాశక్తి - యలమంచిలి

జిల్లాలో కొద్ది రోజులుగా అకాల వర్షాలు కురుస్తూ రైతులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితుల్లో ప్రభుత్వం, అధికార యంత్రాంగం ధాన్యం కొనుగోళ్లు ముమ్మరం చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోళ్లు సాగుతున్న తీరుపై మండలంలో శుక్రవారం పర్యటించి రైతులతో మాట్లాడామన్నారు. మిల్లులకు ధాన్యం తరలించాక రోజులు తరబడి వాహనాలు రావడం లేదన్నారు. దీనికితోడు జిపిఎస్ ఉన్న వాహనాల్లోనే ధాన్యం తరలించాలని నిబంధన ఉండటంతో రైతులు అత్యవసరంగా వేరే వాహనాల్లో ధాన్యం తరలించే పరిస్థితి లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాంబొట్లపాలెం, గుంపర్రు, శిరగాలపల్లి గ్రామాలకు చెందిన పలువురు రైతులు మాట్లాడుతూ కాజలోని జెబిఆర్, అశ్వతా రైస్ మిల్లులు, యలమంచిలిలోని మారుతి సోమేశ్వర, మరికొన్ని రైస్‌మిల్లులోను ధాన్యం దిగుమతి తరువాత పేమెంట్ బిల్లులు ఇవ్వడం లేదని, దీంతోపాటు ధాన్యం తరుగు చూపించి డబ్బులు కట్టించుకుంటున్నారని, ఆ వివరాలు కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మిల్లుల వద్ద ఉన్న కస్టోడియన్ అధికారులు రైతులను పట్టించుకోవడం లేదన్నారు. తక్షణం వాహనాలు ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోళ్లు ముమ్మరం చేయాలని, రైస్‌మిల్లర్ల మోసాలు అరికట్టాలని కోరుతూ సమస్యను యలమంచిలి తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లామని రామాంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ సమస్యను విఆర్ఒల దృష్టికి తీసుకెళ్లి వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో కౌలురైతులు, రైతులు పి.జార్జిబాబు, యు.సత్తిబాబు, జె.త్రిమూర్తులు, జె.శ్రీను, బి.చంటి, సిహెచ్.సత్యనారాయణ, ఎ.వీరాంజనేయులు, పి.వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



గోనె సంచులివ్వాలని నినదిస్తున్న రైతులు, నేతలు

బందోబస్తు నడుమ పోస్టల్ బ్యాలెట్ బాక్సుల తరలింపు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించిన పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్ బాక్సులను పోటీలో ఉన్న అభ్యర్థులు, వారి ఏజెంట్లు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పటిష్ట భద్రత మధ్య విష్ణు కాలేజీ స్ట్రాంగ్ రూమ్‌కు తరలించినట్లు నరసాపురం ఆర్ఒ, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. భీమవరం కలెక్టరేట్ వద్ద నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించిన పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్ బాక్సులను అందరి సమక్షంలో శుక్రవారం విష్ణు కాలేజ్ వద్ద ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. స్ట్రాంగ్ రూమ్‌లో బ్యాలెట్ బాక్స్‌లను ఉంచి సీల్ చేశారు. అనంతరం రిజిస్టర్‌లో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంతకం చేశారు. జిల్లాలో పోస్టల్ బ్యాలెట్‌ను 13,347 మంది, హోం ఓటింగ్ 1,089 మంది మొత్తం 14,433 మంది వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ జె.ఉదయ భాస్కరరావు, ఎలక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ సిహెచ్. దుర్గాప్రసాద్, ఎలక్షన్ డిటి ఎం.సన్యాసిరావు తదితరులు ఉన్నారు.

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం నియోజకవర్గానికి సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ బాక్సులను పోటీలో ఉన్న అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పూర్తి పోలీసు బందోబస్తు మధ్య శుక్రవారం మధ్యాహ్నం భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలకు తరలించినట్లు తాడేపల్లిగూడెం రిటర్నింగ్ అధికారి కె.చెన్నయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపులో పోస్టల్ బ్యాలెట్ ఓట్లను కూడా లెక్కించనున్నట్లు తెలిపారు.

రైతుల పరిస్థితి దయనీయం : నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

జగన్ ప్రభుత్వంలో కనీసం సంచులు లేక ధాన్యపు రాశులు అకాల వర్షాలకు తడుస్తున్నాయని, రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని పాలకొల్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు ప్రాంతంలో శుక్రవారం భారీ వర్షం కురవడంతో ఆయన మండలంలోని గ్రామాల్లో పర్యటించారు. రహదారుల వెంబడి, పొలం గట్లపై ఉన్న ధాన్యపు రాశులను చూసి రైతుల కష్టాలను స్వయంగా చూసి చలించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ రామానాయుడు మాట్లాడుతూ కోత కోసి పది రోజులు గడిచినా సంచులను ప్రభుత్వం సరఫరా చేయకపోవడం వల్లే ధాన్యపు రాశులను ఒబ్బిడి చేసుకునే పరిస్థితి రైతులకు లేకుండాపోయిందన్నారు. ఈ తరుణంలో అకాల వర్షాలతో ధాన్యపు రాశులు తడిసి రైతులు నష్టపోయే పరిస్థితి ఎదురైందన్నారు. కొద్దిపాటి సంచులు వచ్చినా పెద్దపెద్ద చిల్లులతో ఉన్నాయన్నారు. ధాన్యాన్ని ఆన్‌లైన్‌లో చూపిన రైస్‌మిల్లుకు తీసుకెళ్లి అమ్ముకునే పరిస్థితి ఉండటంతో ఆ మిల్లు వద్ద రెండు, మూడు రోజులు పడుతుందని, మరికొన్ని రైస్‌మిల్లులు ఖాళీగా ఉంటున్నాయని తెలిపారు. రైతుల ఇబ్బందులను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పాలకొల్లు నియోజకవర్గానికి 20 నుంచి 30 వేల వరకు సంచులను వెంటనే అందించాలని కోరానన్నారు. సబ్‌కలెక్టర్, తహశీల్దార్‌కు బాధ్యతలు అప్పగించాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందిస్తూ రైతుకు నష్టం లేకుండా చూస్తానని హామీ ఇచ్చినట్లు ఎంఎల్‌ఎ తెలిపారు. కార్యక్రమంలో కోడి విజయభాస్కర్, నున్నబోయిన సత్యనారాయణ, ఉంగరాల నరసింహారావు, బొక్కా రామారావు, పోతినేడి ఎర్రియ్య, కోరా సూరి, రాయి చాలయ్య, రాయి నాగేష్, యినుకొండ మూర్తి, నున్నబోయిన శ్రీనివాసరావు, నున్నబోయిన రామచంద్రమూర్తి పాల్గొన్నారు.



ధాన్యం బస్తా మోస్తున్న నిమ్మల రామానాయుడు

కానిస్టేబుల్, దుకాణదారుడి మధ్య ఘర్షణ

పరస్పర ఫిర్యాదులతో కేసుల నమోదు

ప్రజాశక్తి - నరసాపురం

కానిస్టేబుల్‌పై దాడి ఘటనపై కేసు నమోదు చేశామని నరసాపురం డిఎస్‌పి జి.శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని జాతీయ రహదారిని ఆనుకుని లూథరన్ చర్చి వద్ద చికెన్ పకోడీ సెంటర్‌ను కొపనాతి దానయ్య, దుర్గ దంపతులు నిర్వహిస్తున్నారు. గురువారం రాత్రి బీట్ తిరుగుతున్న కానిస్టేబుల్ జి.పాపారావు షాప్ కట్టాలని చెప్పగా ఆ దంపతులిద్దరూ కానిస్టేబుల్ పట్ల దురుసుగా ప్రవర్తించి దాడి చేశారన్నారు. కానిస్టేబుల్ ముఖంపై కొట్టడంతో కంటికి గాయమైందని, ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు కొపనాతి దానయ్యపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు డిఎస్‌పి తెలిపారు.

అయితే తనపై కానిస్టేబుల్ లాఠీతో దాడి చేశారని, తనకు గాయాలయ్యాయని దానయ్య కూడా ప్రభుత్వాసుపత్రిలో చేరారు. దానయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డిఎస్‌పి తెలిపారు.

కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లపై సమీక్ష

ప్రజాశక్తి - భీమవరం టౌన్

రాష్ట్ర సచివాలయం కాన్ఫరెన్స్ హాల్ నుంచి రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా శుక్రవారం సాయంత్రం సాధారణ ఎన్నికలు - 2024లో భాగంగా కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు, స్ట్రాంగ్ రూమ్‌ల్లో ఇవిఎంలు, వివిప్యాట్‌లు భద్రత తదితర అంశాలపై జిల్లా ఎన్నికల అధికారులు, ఐజిలు, డిఐజిలు, సిపిలు, ఎస్‌పిలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. భీమవరం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్, జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అజిత వేజెండ్ల పాల్గొన్నారు.

జిల్లాలో పలు చోట్ల చిరుజల్లులు

ప్రజాశక్తి - ఆచంట

మండలంలో శుక్రవారం మధ్యాహ్నం నుంచి చిరుజల్లు పడుతున్నాయి. నెల రోజులుగా తీవ్ర ఎండ ప్రభావంతో సతమతమవుతున్న ప్రజలకు చిన్నపాటి వర్షం పడడంతో కాస్త ఊరట పొందుతున్నారు. ఒకపక్క చిరుజల్లు, మరోపక్క ఉక్కబోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. రెండు రోజులుగా వాతావరణం మారింది. ఆకాశం మేఘావృతమై వర్షాలు కురుస్తున్నాయి. మండలంలో ఆచంట, కొడమంచిలి, పెదమల్లం, కోడేరు, కందరవల్లి, కరుగోరుమిల్లి, వల్లూరు, భీమలాపురం, పెనుమంచిలి, ఆచంట వేమవరం, శేషమ్మచెరువు, అయోధ్యలంక గ్రామాల్లో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో అక్కడక్కడా చిరుజల్లులు కురుస్తున్నాయి. ఈ వర్షాలకు చిన్నారులు, యువకులు, కేరింతలు కొడుతున్నారు.



మొగల్తూరులో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

మొగల్తూరు : మండలంలో శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ చిరుజల్లులు పడ్డాయి. 15 రోజులుగా అధిక ఉష్ణోగ్రతలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. చిన్నపాటి వర్షం పడడంతో వాతావరణం చల్లబడింది. దీంతో ప్రజలు సేద తీరారు. కురిసిన కొద్దిపాటి వర్షానికి గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో వర్షపునీరు రహదారిపై నిలిచిపోయింది. దీంతో ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు.

శశి ఇంజనీరింగ్ కళాశాలకు అదనపు సీట్లు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

శశి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇంజనీరింగ్ కళాశాలకు 2024 - 25 సంవత్సరానికి ఎఐసిటిసి న్యూఢిల్లీ వారు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో ప్రస్తుతం ఉన్న 180 సీట్లకు అదనంగా 60 సీట్లు, కంప్యూటర్ సైన్స్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్ విభాగంలో ప్రస్తుతం ఉన్న 120 సీట్లకు అదనంగా 60 సీట్లు మంజూరయ్యాయని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ఛైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ తెలిపారు. రాబోయే కాలంలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్ ప్రముఖపాత్ర పోషించనుందని కళాశాల వైస్ ఛైర్మన్ మేకా నరేంద్రకృష్ణ తెలిపారు. ఈ మేరకు వారు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

మండలాలకు పాఠ్యపుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పశ్చిమ, ఏలూరు జిల్లాల వ్యాప్తంగా డిస్ట్రిక్ట్ గవర్నమెంట్ టెక్స్ట్, వర్క్ బుక్స్ తాడేపల్లిగూడెం సేల్స్ డిపో మేనేజర్ టి.భాస్కరరావు శుక్రవారం ఉదయం 10 గంటలకు జిల్లాలోని అన్ని మండలాలకు ఆర్‌టిసి డిపో బస్సుల ద్వారా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో బుక్స్ మేనేజర్ టి.భాస్కర్‌రావు, ఆర్‌టిసి సూపర్‌వైజర్ డి.విజయ్ కుమార్, కార్గో మేనేజర్ జి.మాధవరావు, ఆర్‌టిసి సిబ్బంది, హమాలీలు, గవర్నమెంట్ బుక్స్ సేల్స్ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కాళ్లకూరు వెంకన్న కళ్యాణోత్సవాలు

ప్రజాశక్తి - కాళ్ల


కాళ్లకూరులో విద్యుద్దీపాలంకరణలో వెంకటేశ్వరస్వామి ఆలయ గోపురం

కాళ్లకూరు వెంకటేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. స్వామివారి వార్షిక తిరుకళ్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం మంగళ వాయిద్యాల నడుమ విశ్వక్సేన ఆరాధన, భగవత్ పుణ్యవచనం, స్వామి అమ్మవార్లకు అష్టోత్తర శత (కమల) తామర పుష్పపూజ, మత్ సంగ్రహణం, అంకురారోపణ, ధ్వజారోహణ, దీక్ష ధారణ ఘనంగా నిర్వహించారు. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం.అరుణ్‌కుమార్, సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలో చలువ పందిర్లు, క్లాత్ డెకరేషన్, విద్యుద్దీపాలంకరణలు ఏర్పాటు చేశారు. దాతలు, యాత్రికుల సహకారంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

పోలింగ్ శాతం పెరుగుదలపై వైసిపి ధీమా

ప్రజాశక్తి - పెనుమంట్ర



ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో పెరిగిన పోలింగ్ శాతం తమకే అనుకూలంగా ఉంటుందని వైసిపిబ ఆచంట ఎంఎల్ఎ అభ్యర్థితో సహా, పలువురు ద్వితీయ, తృతీయ స్థాయి నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రతిపక్ష పార్టీలు అంటున్నట్టు ఈ ఎన్నికల్లో పోల్ పర్సంటేజ్ పెరిగితే అది అధికార పక్షానికి ఇబ్బంది అనేది ఎంతమాత్రమూ నిజం కాదని, అందుకు గత చరిత్ర నిదర్శనమని అంటున్నారు. 2004 ఎన్నికల్లో వైఎస్ఆర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ హయాంలో పోలింగ్ శాతం 69.08 వస్తే, 2009 ఎన్నికల్లో మరలా వైఎస్ఆర్ ఆధ్వర్యంలోనే కాంగ్రెస్‌కు 72.07 శాతం వచ్చిందని వారు అంటున్నారు. 2004, 2009లో జరిగిన సాధారణ ఎన్నికల మధ్య పెరిగిన శాతాన్ని పరిశీలిస్తే, ఆ రెండు ఎన్నికల మధ్య 2.09 మేరకు పెరిగిన పోలింగ్ శాతంతో తిరిగి వైఎస్ఆర్ ముఖ్యమంత్రి అయ్యారని, అదే విధంగా ప్రస్తుతం 2019, 2024 ఎన్నికల మధ్య పెరిగిన పోలింగ్ శాతం జగన్ మోహన్‌రెడ్డిని మరలా ముఖ్యమంత్రిని చేస్తుందని వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు.


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యం

ప్రజాశక్తి - ఉండి

ఆరోగ్య సురక్షతో ప్రతి ఒక్కరికీ మరింత మెరుగైన వైద్యం అందుతుందని డాక్టర్ పి.లక్ష్మీసునంద అన్నారు. శుక్రవారం మండలం పాములపర్రు గ్రామంలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్నుద్దేశించి డాక్టర్ లక్ష్మీసునంద మాట్లాడారు. కనీస వైద్య సదుపాయాలు లేని గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బిపి, షుగర్ వ్యాధిగ్రస్తులకు, గర్భిణులకు ప్రత్యేక వైద్య సేవలందిస్తున్నట్లు తెలిపారు. వైద్యం అవసరమైన ప్రతి ఒక్కరికీ ఉచితంగా వైద్య సేవలందించడమే కాకుండా మందులు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్మ హాస్పిటల్ డాక్టర్ కె.సత్యానందం, గాయత్రి హాస్పిటల్ డాక్టర్ కె.గుణప్రశాంత్ పాల్గొని రోగులకు వైద్య సేవలందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యండగండి పిహెచ్‌సి వైద్య విస్తరణాధికారి పి.రత్నరాజు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి చెన్నకేశవస్వామి కళ్యాణోత్సవాలు

ప్రజాశక్తి - ఉండి

నేటి నుంచి చెన్నకేశవ స్వామి కళ్యాణ మహోత్సవాలు ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ యర్రా వెంకట సుబ్బారావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని ఉప్పులూరు గ్రామంలోని చెన్నకేశవ స్వామి వారి కళ్యాణ మహోత్సవాలు శనివారం నుంచి శుక్రవారం వరకూ వారం రోజుల పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయని ఈ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మారిన వాతావరణం : రైతుల్లో గుబులు

ప్రజాశక్తి - పెనుమంట్ర



గడిచిన మూడు రోజులుగా వర్షాలు, నీరెండ, మేఘాలతో ఉంటున్న వాతావరణం రైతుల్లో గుబులు పుట్టిస్తోంది. మండలంలోని 18 గ్రామాల్లో కేవలం కొన్ని ప్రాంతాల్లో మాత్రమే సుమారుగా 10 నుండి 20 శాతం మేరకు వరి కోతలు, మాసూళ్లు ఉండిపోయాయని రైతులు అంటున్నారు. ఈ పనులు చేసుకోవడానికి వాతావరణం సహకరించడం లేదని వారు వాపోయారు. వచ్చే రెండు, మూడు రోజుల్లో వర్షాలు పడతాయని, వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో పొలాల్లో కోత కాకుండా, కోసిన చోట పనల మీద ఉన్న పంటను, నూర్పిడికోసం రోడ్డు మార్జిన్లు, కల్లాలకు చేర్చిన ధాన్యాన్ని రక్షించుకొనే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. అయితే వర్షానికి తడిసిన ధాన్యాన్ని, వరి పనలను జాగ్రత్తగా వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు పాటించి, నష్ట నివారణ చేసుకోవాలని మార్టేరు వరి పరిశోధనా స్థానం ఎడిఆర్ డాక్టర్ డి.శ్రీనివాస్ అన్నారు.

ఉప్పుటేరుపై వంతెన కలేనా..!

- దశాబ్ధాల తరబడి కోరుతున్నా పట్టని వైనం
- పడవలపైనే ప్రయాణం
- నెల్లిపల్లవపాలెం, గెదళ్లవంపు గ్రామస్తుల అవస్థలు


పడవలపై ఉప్పుటేరు దాటుతున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం నార్త్ పంచాయతీ పరిధి నెల్లిపల్లవపాలెం, ముత్యాలపల్లి పంచాయతీ పరిధి గెదళ్లవంపు గ్రామాల మధ్య ఉన్న ఉప్పుటేరుపై వంతెన నిర్మించాలని గ్రామస్తులు మూడు దశాబ్దాలుగా ప్రభుత్వాన్ని కోరుతున్నా నేటికీ కలగానే మిగిలింది. పక్క పక్కనే ఉన్న గ్రామాల్లో రాకపోకలు సాగించేందుకు సుమారు ఏడు కిలోమీటర్లు మోడీ, ముత్యాలపల్లి మీదుగా చుట్టూ తిరిగి రావాల్సి వస్తోంది. దీంతో ప్రజలు ప్రమాదకర పరిస్థితుల నడుమ నాటు పడవలపైనే ఉప్పుటేరు దాటాల్సిన పరిస్థితి నెలకొంది. సుమారు ఎనిమిది సంవత్సరాల కిందట ఇక్కడ జరిగిన పడవ ప్రమాదంలో ముగ్గురు ఉప్పుటేరులో మునిగి ప్రాణాలు కోల్పోయారు. 30 సంవత్సరాలుగా జరిగిన పడవ ప్రమాదాల్లో సుమారు 9 మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఆ ప్రాంతంలో వంతెన నిర్మాణం ఆవశ్యకత ఎక్కువైంది.



పేరుపాలెంనార్త్‌లోని నెల్లిపాల్లవపాలెం, గెదళ్లవంపు గ్రామాల మధ్య ఉన్న ఉప్పుటేరు

వంతెన నిర్మాణంతో..

ఈ ప్రాంతంలో వంతెన నిర్మిస్తే తీరప్రాంత గ్రామాలకు 216 జాతీయ రహదారికి అనుసంధానమయ్యేందుకు అవకాశం ఉంటుంది. పేరుపాలెం, పేరుపాలెం సౌత్, కెపి.పాలెం నార్త్, కెపి.పాలెం సౌత్ గ్రామాల నుంచి రైతుల ఉత్పత్తుల రవాణాకు అవకాశం ఉంటుంది. ఆయా గ్రామాల్లోని మత్స్యకారుల అభివృద్ధికి వంతెనతో పునాదులు ఏర్పడతాయని పలువురు అంటున్నారు. అధికారులు, పాలకులు స్పందించి వంతెన నిర్మించాలని కోరుతున్నారు.

వంతెన నిర్మించాలి..

5. అందే ఫణీంద్రనాథ్, మాజీ ఎంపిటిసి సభ్యులు



ఈ ప్రాంతంలో వంతెన నిర్మించాలని తాము మూడు దశాబ్దాలుగా పోరాటాలు చేస్తున్నాం. నాయకులు హామీలు ఇస్తున్నారు. ఆ హామీలు అమలు జరగడం లేదు. నాలుగు రోజుల క్రిందట నర్సాపురం పర్యటనకు వచ్చిన కేంద్రమంత్రి నిర్మల సీతారామన్ దష్టికి వంతిని సమస్యలు తీసుకువెళ్లాం దీనిపై ఆమె సానుకూలంగా స్పందించారు. వంతెన నిర్మాణానికి కషి చేస్తానని హామీ ఇచ్చారు. వంతెన నిర్మాణం పూర్తయితే మండలంలోని సముద్ర తీర ప్రాంత గ్రామాలు అభివద్ధి చెందేందుకు అవకాశం ఉంటుంది.

'ఉండి'లో రికార్డుస్థాయి పోలింగ్

ప్రజాశక్తి - కాళ్ల


క్యూలో ఉన్న ఓటర్లు (ఫైల్‌ఫొటో)

ఉండి నియోజకవర్గ చరిత్రలో రికార్డుస్థాయి 86.20 శాతం పోలింగ్ నమోదైంది. ఇదే సమయంలో కొన్ని పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 11 గంటల వరకూ ఓటింగ్ జరిగిందంటేనే ఓటరు చైతన్యం ఎంతలా వెల్లివిరిసిందనేదీ అర్థం చేసుకోవచ్చు. అయితే ఈ రేంజులో పోలింగ్ జరగడానికి కారణాలు ఏంటనే దానిపై రాజకీయ విశ్లేషకులు, పార్టీల శ్రేణులు విశ్లేషించే పనిలో పడ్డారు.

నియోజకవర్గంలో అత్యధికంగా మహిళా ఓటర్లు ఉండడమే కాకుండా ఓటు హక్కును వినియోగించుకున్నది మహిళలేనని అధికారిక లెక్కలు తేల్చేశాయి.

జిల్లాలోనే ఉండి నియోజకవర్గం అత్యధికంగా పోలింగ్ నమోదు చేసుకుని రికార్డు నెలకొల్పిన విషయం తెలిసిందే. నియోజకవర్గంలో 2,24,725 మంది ఓటర్లకుగాను 1,93,783 ఓట్లు పోలయ్యాయి. 86.23 శాతం నమోదై రికార్డు నెలకొల్పారు. పురుష ఓటర్లు 96,707 మంది ఓటు వేయగా, 84.72 శాతంతో 97,074 మంది మహిళా ఓటర్లు, ఇద్దరు ట్రాన్స్ జెండర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో అందరి దృష్టి ఉండిలో పోలింగ్‌పై పడేటట్లు చేసింది. నియోజకవర్గంలో పురుషులు కన్నా మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. మొత్తం పురుషుల కంటే మహిళల ఓట్ల శాతం గణనీయంగా పెరిగింది.

ఉండి నియోజకవర్గంలో టిడిపి, వైసిపి, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలు హోరాహోరీగా తలపడ్డాయి. పోలింగ్ శాతం భారీగా పెరగడం, కొత్త ఓట్లు యువత ఉత్సాహంగా పాల్గొనడం, మహిళలు కూడా భారీగా పోలింగ్‌లో పాల్గొనడంపై ఎవరికి వారు తమదే గెలుపంటున్నారు.

46 కేంద్రాల్లో 90 శాతంపైగా..

ఉండి నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో 46 కేంద్రాల్లో 90 శాతం పైగా పోలింగ్ నమోదైంది. కాళ్ల మండలంలోనే 11 కేంద్రాల్లో 90 శాతంపైగా ఓటింగ్ జరిగింది. కాళ్లకూరు, మోడీ, పల్లిపాలెం, అనందపురం, బొండాడపేట ఒక్కో పోలింగ్ కేంద్రంలో, సీసలిలో రెండు కేంద్రాల్లో 90 శాతం పైగా పోలింగ్ నమోదైంది. దొడ్డనపూడి గ్రామంలో నాలుగు పోలింగ్ కేంద్రాల్లో రికార్డుస్థాయిలో 90 నుంచి 94 శాతం వరకూ ఓటింగ్ జరిగింది. ఆకివీడు మండలం దుంపగడప గ్రామంలో రెండు బూత్‌ల్లో, పెదకాపవరం, ఆకివీడులో ఒక్కో బూత్, ఉండి మండలం పాములపర్రులో రెండు బూత్‌ల్లో, ఎన్ఆర్‌పి అగ్రహారం గ్రామంలో ఒక్కో బూత్‌లో 90 శాతం ఓటింగ్ దాటింది. గత ఎన్నికలతో పోలిస్తే ఆయా కేంద్రాల్లో ఓటింగ్ శాతం భారీగా పెరిగింది. కాళ్ల మండలం దొడ్డనపూడిలో 215వ నంబరు బూత్‌లో అత్యధికంగా 94.36 శాతం ఓటింగ్ నమోదైంది. ఉండి నియోజకవర్గంలో మహిళల ఓట్లు పోలవ్వడంపై వైసిపి, టిడిపి ఇద్దరూ తమకే అనుకూలమని చెప్పుకుంటున్నాయి.

సంక్షేమ పథకాలు ఎక్కువగా పొందిన మహిళలు పోలింగ్‌కు భారీగా తరలిరావడం తమకు సానుకూలంగా వైసిపి నాయకులు చెబుతున్నారు. అయితే మహిళల్లో వ్యతిరేకత వల్ల ఎక్కువమంది పోలింగ్‌కు వచ్చి టిడిపికి అనుకూలంగా ఓటు వేశారని ఆ పార్టీ నాయకులు ధీమాగా ఉన్నారు. మహిళా ఓటర్లు ఎటువైపు మొగ్గుచూపారన్నది తెలియాలంటే వచ్చే నెల నాలుగో తేదీ వరకూ వేచి చూడాల్సిందే.

ప్రతిరోజూ వ్యాయామం చేయాలి

పిహెచ్‌సిల్లో రక్తపోటు దినోత్సవం

ప్రజాశక్తి - గణపవరం



పాలకొల్లు రూరల్ : బిపి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రతి రోజూ వ్యాయామం చేయాలని డాక్టర్ పి.సంతోష్ నాయుడు, డాక్టర్ ప్రియాంక తెలిపారు. గణపవరం, పిప్పర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా శుక్రవారం రోగులతో వైద్యశాఖ అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతి ఒక్కరూ డాక్టర్ల సూచనల మేరకు జీవనశైలిలో మార్పులు చేసుకోవాలన్నారు. బిపి అదుపులో ఉంచేందుకు తగిన జాగ్రత్త తీసుకోవాలన్నారు. రక్తపోటు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. 30 సంవత్సరాలు పైబడినవారు వారానికి ఒకసారి బిపి పరీక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారులు జాలాది విల్సన్‌బాబు, జి.వెంకటేశ్వరరావు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : లంకలకోడేరు పిహెచ్‌సి పరిధిలో అర్థకట్ల సచివాలయం, కమ్ము గ్రామంలో డాక్టర్ అడ్డాల ప్రతాప్ కుమార్, డాక్టర్ ఎం.నవ్యజీవన్ ఆధ్వర్యంలో ప్రపంచ రక్తపోటు దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 30 సంవత్సరాలు దాటిన వారికి బిపి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రతాప్ కుమార్ మాట్లాడుతూ పదేళ్లుగా గ్రామీణ ప్రాంతాల్లో అధిక రక్తపోటు ఉన్నవారు పెరుగుతున్నారని, వారికి రక్తపోటు పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నామని, అలాగే సలహాలు, సూచనలు ఇచ్చామని తెలిపారు. ప్రతిరోజూ ఆహారంలో తీసుకునే ఉప్పు శాతం పెరగడం వల్ల రక్తపోటు పెరుగుతుందన్నారు. రక్తపోటు ఉన్నవారు మందులు సక్రమంగా వాడకపోతే తలలో రక్తనాళాలు చిట్లి పక్షవాతం వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం.నవ్యజీవన్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పిహెచ్ఎన్ పి.ఎలిజిబెత్, ఫార్మసిస్ట్ పివి.స్వామి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.


గణపవరంలో..

డ్రెయినేజీల్లో పూడికతీత పనులు చేపట్టాలి

మున్సిపల్ కమిషనర్ శ్యామల


ప్రజాశక్తి - భీమవరం టౌన్


అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ శ్యామల

వర్షాలు ప్రారంభం కాకముందే పట్టణంలోని డ్రెయినేజీల్లో పూడికతీత పనులు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ శ్యామల అధికారులకు సూచించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్‌తో కలిసి అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ రివ్యూలో కమిషనర్ రానున్న వర్షాకాలంలోపు పట్టణంలోని ప్రధాన డ్రెయిన్లలో పూడిక తీయించడానికి తగు ప్రణాళికతో సిద్ధం కావాలని సిబ్బందికి సూచించారు. ప్రధాన డ్రెయినేజీల్లో పూడిక తీయడానికి కాంట్రాక్టులు పిలవాలన్నారు. ప్రధాన డ్రెయిన్లను కలుపుతూ ఉండే మధ్యస్థ డ్రెయిన్‌లను పూడిక తీయడానికి పురపాలక సంఘంలో అందుబాటులో ఉన్న యంత్రాలను ఉపయోగించాలని తెలిపారు.

హెచ్ఐవి బాధితులు సిడిఫోర్ పరీక్ష చేయించుకోవాలి

ప్రజాశక్తి - తణుకు


సిడిఫోర్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ అరుణ

హెచ్ఐవి బాధితులు క్రమం తప్పకుండా సిడిఫోర్, వైరల్ లోడ్ పరీక్షలు చేయించుకోవాలని తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణ సూచించారు. శుక్రవారం స్థానిక ఆసుపత్రి ఆవరణలోని సేఫ్ కేర్ సెంటర్ వద్ద ఎపిసాక్స్(ఎపిఎస్ఎసిఎస్) వారు ఇచ్చిన రూ.50 లక్షల విలువచేసే సిడిఫోర్ యంత్రాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ వెలగల అరుణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోగుల్లో వ్యాధి తీవ్రతను తెలుసుకునేందుకు సిడిఫోర్, వైరల్ లోడ్ పరీక్షలు నిర్వహించి, మందులు ఇస్తారని తెలిపారు. సిడిఫోర్ కౌంట్ 350 కంటే తక్కువ ఉండి, వైరల్ లోడ్ 1000 కాపీలు కంటే ఎక్కువ ఉంటే, తిరిగి సిడిఫోర్ కౌంట్ 350 కన్నా ఎక్కువ ఉండి వైరల్ లోడ్ 1000 కాపీలు కంటే తక్కువ వచ్చేవరకు ప్రతి 3 నెలలకు సీడిఫోర్ చేయాల్సి వస్తుందని తెలిపారు. గతంలో సిడిఫోర్ టెస్టులు చేయాలంటే వారానికి ఒక రోజు మాత్రమే ఏలూరు లేదా తాడేపల్లిగూడెం వెళ్లి పరీక్షలు నిర్వహించాల్సి వచ్చేదని, ఇప్పుడు సిడిఫోర్ యంత్రం తణుకు సెంటర్‌కు రావడం వల్ల రోగులకు ప్రతి రోజూ మెరుగైన సేవలందించగలమని తెలిపారు. రోగులకు అండగా నిలబడుతూ వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపుతూ, ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్న సెంటర్ వైద్యాధికారి సుంకవల్లి రామకృష్ణను అభినందించారు. సెఫ్‌కేర్ సెంటర్ వైద్యాధికారి సుంకవల్లి రామకృష్ణ మాట్లాడుతూ హెచ్ఐవి బారిన పడిన వ్యక్తి రోగనిరోధక వ్యవస్థ ఆరోగ్యాన్ని తనిఖీ చేయడానికి సిడిఫోర్ కౌంట్ ఎక్కువగా ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ డాక్టర్ రాజరాజేశ్వరి, డాక్టర్ శారద, డాక్టర్ చక్రధర్, డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ సాయిబాలాజీ, డాక్టర్ రఘువీర్, డాక్టర్ దుర్గామహేష్, ఐసిటిసి, డిఎస్ఆర్‌సి, ఎఆర్‌టి సిబ్బంది పాల్గొన్నారు.

27న దేశాలమ్మవారి జాతర

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులో దేశాలమ్మవారి 52వ జాతర మహోత్సవాలు ఈ నెల 27 నుంచి జూన్ 2వ తేదీ వరకూ ఘనంగా నిర్వహించనున్నారు. 27వ తేదీ రాత్రి ఒకే సమయంలో 12 స్టేజీలపై 12 ప్రోగ్రామ్‌లు నిర్వహిస్తారు. అనంతరం రాత్రి ఒంటి గంటకు బాణసంచా కాలుస్తారు. 28వ తేదీ సాయంత్రం పట్టణంలో భారీ ఊరేగింపు నిర్వహిస్తారు. జూన్ 7న నవకాయ పిండి వంటలతో భారీ అన్న సమారాధన నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద భారీ లైటింగ్ ఏర్పాటు చేస్తున్నారు.

'రైతుల సమస్యలు పట్టించుకోరా'

ప్రజాశక్తి - ఉండి

రైతుల సమస్యలు పట్టించుకునేవారే కరువయ్యారని మండలంలోని మహాదేవపట్నం గ్రామానికి చెందిన రైతు తక్కెళ్ల శివప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామం నుంచి భీమవరం రహదారి వరకూ కొంత మంది రోడ్డు వెంబడి కొబ్బరిచెట్లు లీజుకు తీసుకున్నారని, కొన్ని సంవత్సరాల నుంచి ఫలసాయం పొందుతున్నారని తెలిపారు. అయితే ఆయా కొబ్బరి చెట్ల మధ్య లీజుదారులు కొత్తగా కొబ్బరి మొక్కలు వేశారని తెలిపారు. అయితే అటుగుండా పొలాలు ఉన్న రైతులు వెళ్లేందుకు లీజుదారులు ఒప్పుకోవడం లేదని, తమ మొక్కలు పాడైపోతున్నాయని ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదేంటని ప్రశ్నిస్తున్న రైతులపై దౌర్జన్యానికి దిగుతున్నారని వాపోయారు. దీనిపై పలుమార్లు గ్రామ పంచాయతీ అధికారులకు, ఇరిగేషన్ అధికారులకు వినతులు ఇచ్చినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. ఇప్పటికే చాలా మంది వ్యవసాయాన్ని వదిలేశారని, వ్యవసాయంపై మక్కువతో కొనసాగిస్తున్న తమను అధికారులు పట్టించుకోవడం లేదని, ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

ఎపిటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఎపి టీచర్స్ ఫెడరేషన్ -1938 జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికలు స్థానిక పిఎస్ఎం గర్ల్స్ హైస్కూల్ గురువారం సాయంత్రం జరిగాయి. ఈ ఎన్నికలకు అధికారిగా రాష్ట్ర కార్యదర్శి ఎ.ఉదయ బ్రహ్మం వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో జిల్లా ప్రధాన కార్యదర్శిగా పివిఎస్ఎస్‌బి.రమణారావు, జిల్లా అధ్యక్షులుగా బి.ఓంప్రకాష్, జిల్లా గౌరవాధ్యక్షులుగా బి.దుర్గాప్రసాద్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులుగా ఎస్‌కె.బాబాజీసాహెబ్, జిల్లా ఉపాధ్యక్షులుగా వి.శ్రీవల్లి, పి.రాజేశ్వరరావు, బి.ఆదినారాయణ, అదనపు కార్యదర్శిగా కె.గంగరాజు, కార్యదర్శులుగా ఎఎన్‌వి.సుభాషిణి, డి.అంజనీదేవి, ఎన్.ఆంజనేయులు, పి.గంగా కుమారి, జె.సత్యనారాయణ, జి.శ్రీనివాస్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా పి.నాగరాజు, ఎకడమిక్ కమిటీ కన్వీనర్‌గా డి.తిరుమలేశ్వరి ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన జిల్లా కార్యవర్గంతో ఉదయబ్రహ్మం ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఓంప్రకాష్, రమణ మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్య సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షులు షేక్ బాబాజీ సాహెబ్ మాట్లాడారు.

నేడు నియోజకవర్గ నేతలతో గోపీ సమీక్ష

పాలకొల్లు : నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపి ఈనెల 18వ తేదీ శనివారం నియోజకవర్గంలోని వివిధ మండలాల నేతలతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నారు. ఉదయం 9:30 నిమిషాలకు యలమంచిలి మండలం ముఖ్యనాయకులతో విస్తృత సమావేశంలో పాల్గొంటారు. అనంతరం 10:30 నిమిషాలకు పాలకొల్లు మండల ముఖ్య నాయకులతో సమావేశమవుతారు. అలాగే మధ్యాహ్నం 11:30 నిమిషాలకు పోడూరు మండల ముఖ్య నాయకులుతో విస్తత సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12 గంటలకు పాలకొల్లు టౌన్ ముఖ్య నాయకులుతో విస్తృత సమావేశంలో పాల్గొంటారు. కావున రాష్ట్ర, జిల్లా, మండల, పట్టణ గ్రామ నేతలు మహిళా నాయకురాలు కార్యకర్తలు అభిమానులు పాల్గొనవలసిందిగా గోపి కోరారు.

నేడు కాకినాడలో జాబ్ మేళా

ప్రజాశక్తి - పెనుమంట్ర

అంతర్జాతీయ ఎల్‌అండ్‌టి కంపెనీలో 1600 ఐటిఐ ట్రేడ్స్‌లో పాసైన విద్యార్థులకు ఈ నెల18న కాకినాడలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కాకినాడ గవర్నమెంట్ ఐటిఐ ప్రిన్సిపల్ కమ్ కన్వీనర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక గవర్నమెంట్ ఐటిఐ ప్రాంగణంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఈ ఎంపిక కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ మేరకు ఐటిఐ (ఎన్‌టిసి)లో పాస్ అయిన ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, డ్రాఫ్ట్ మెన్-సివిల్, వెల్డర్, పంబ్లర్, వైర్ మెన్, కార్పెంటర్, మాసన్ ట్రేడ్‌లకు చెందిన 1600 ఖాళీలకు ఎంపిక చేస్తారని వెల్లడించారు. ఎంపికైన విద్యార్థులకు మూడు నెలలు శిక్షణ ఇచ్చి, ఎపి, తెలంగాణ, చెన్నయ్ బెంగళూరు ప్రాంతాల్లో నియామకాలు ఇస్తారని, అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తోపాటు, ఒక సెట్ జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని వారు కోరారు.